క్లుప్తంగా

యువత క్రీడల్లో రాణించాలి

పాల్వంచరూరల్: గ్రామీణ యువత క్రికెట్ క్రీడలో రాణించాలని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. దంతలబోరు గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగు మండలాల స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన కొత్వాల విజేత బూర్గంపాడు జట్టుకు రూ.25వేలు, ద్వితీయ ములకలపల్లి జట్టుకు రూ.15వేల నగదు, షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పాపారావు, పోలేబోయిన నాగరాజు, కిరణ్, సతీష్, మహేష్ పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలు పాటించండి

సింగరేణి(కొత్తగూడెం): కంపెనీ నియమితులైన బదిలీ వర్కర్లు సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను, అధికారులు సూచించిన రక్షణ సూత్రాలను పాటిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు అన్నారు. గురువారం మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు తొమ్మిది మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నాగాలు లేకుండా ఉద్యోగం చేసుకోవాలని సూచించారు.

ఎరియర్స్ విడుదల చేయాలి

కొత్తగూడెంఅర్బన్: ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న జేఎల్ఎంఎస్‌లకు ఎరియర్స్ విడుదల చేయాలని కోరుతూ లక్ష్మీదేవిపల్లి విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఎల్ఎంఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు కూనూరాజు శ్రీనివాసు మాట్లాడుతూ.. 2011 నుంచి ఉన్న జేఎల్ఎంఎస్‌లు 2011 నుంచి 2016 వరకు కూడా తక్కువ స్టాఫ్ ఉన్నప్పటికీ తక్కువ వేతనంతో పని చేసినట్లు చెప్పారు. కష్టాన్ని కార్మిక సంఘాలు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఈ సమస్యను సీఐటీయూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని పరిష్కారానికి పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లి వెంకటరాజు, పులి గణేష్‌బాబు, పదిలం శ్రీనివాస్, భద్రాచలం కొత్తగూడెం డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి

సింగరేణి(కొత్తగూడెం): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వీడాలని బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఇనపనూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఉదయం బీఎంఎస్ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచకుండా 18 రోజుల సమ్మె సందర్భంగా ఒప్పందంలోని అంశాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వీడాలన్నారు. తక్షణమే కనీస వేతనాల జీఓలను రివైజ్ చేయాలని, జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు పెంచాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్ఐ కార్డులను ఇవ్వాలని, సీఎంపీఎఫ్ పాస్‌బుక్‌లు అప్‌డేట్ చేయాలన్నారు.

పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

పాల్వంచరూరల్: పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి బూర్గంపాడు మండలం జింకలగూడెం వద్ద నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు సిద్ధంగా పశువులు ఉన్నాయని, తెలుసుకుని అక్కడకు వెళ్లిన బూర్గంపాడు మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనుపై దాడి చేసి గాయపరిచగా పాల్వంచలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని ఈ దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బంక్ నిర్మాణ పనుల్లో జాప్యం

- ఇల్లెందు బస్టాండ్‌కు చేరిన ఆయిల్ నిల్వ ట్యాంకర్లు
- చర్ల, దమ్మపేటల్లో మాత్రం వేగంగా పనులు



బంక్ ఏర్పాటుకు తీసుకొచ్చిన ఆయిల్ ట్యాంకర్లు

ఇల్లెందు: అటు ఆర్టీసీకి ఇటు ప్రజలకు ఉపయోగపడేలా ఇల్లెందు బస్టాండ్ (మెయిన్ రోడ్డుకు సమీపంలో) ఆవరణలో నిర్మించ తలపెట్టిన పెట్రోల్ – డీజిల్ బంక్ ఏర్పాటు జాప్యం జరుగుతోంది. ఖమ్మం ఆర్ఎం పరిధిలో చర్ల, దమ్మపేట, ఇల్లెందులో ఆర్టీసీ బంక్‌లు మంజూరైన విషయం విదితమే. టెండర్ కూడా పూర్తై బీపీసీఎల్ కంపెనీ నిర్మాణం బాధ్యత చేపట్టింది. చర్ల, దమ్మపేటలోని బంక్‌లు పూర్తికావొచ్చాయి. ఇల్లెందులో మాత్రం ఆయిల్ ట్యాంక్‌లను స్థలంలోకి చేర్చారు. ఇక నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో అధికారులకే తెలియాలి. బంక్ నిర్మాణం పూర్తయితే అటు డిపోలోని బస్‌లకు ఇటు ప్రైవేట్ వాహనాలకు ఇంధనానికి ఇబ్బందులు తప్పుతాయి.

తాత్కాలికంగా ఏర్పాటు..

రెండేళ్ల క్రితం ఆర్టీసీ డిపో ప్రారంభం అయినా బంక్ లేక పోవటం వల్ల ఇక్కడి బస్‌లకు ఇబ్బందులు ఎదురయ్యాయి. డీజిల్ కోసం ప్రతీ బస్ కొత్తగూడెం డిపోకు వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణికులను గమ్యానికి సకాలంలో చేర్చలేకపోతున్నారు. ప్రతీ బస్ ప్రతీరోజు కొత్తగూడెం వెళ్లి రావాల్సి వస్తోంది. ఈ తరుణంలో ఇటీవల కాలంలో డిపోలో తాత్కాలికంగా రెండు వేల లీటర్ల ట్యాంక్ ఒకటి ఏర్పాటు చేశారు. దీంతో డిపోలో బస్‌లకు ఇక్కడే డీజిల్ నింపి పంపించేలా తాత్కాలిక ఏర్పాట్లు చేయటంతో కొంత వరకు డీజిల్ సమస్య తీరింది. అయితే డిపోకు అటు వ్యాపారానికి అనుగుణంగా ఉండేలా రోడ్ వైపుకు బంక్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. టెండర్ పూర్తి చేశారు, ట్యాంకర్లు కూడా వచ్చాయి. అయితే మెయిన్ రోడ్ వైపునకు ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్‌ను కూల్చాల్సి ఉంది.



ఇల్లెందు బస్టాండ్

బంక్ నిర్మాణం పూర్తి చేయాలి..



ఇల్లెందు బస్ డిపోలో బంక్ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి. బస్టాండ్‌లో బంక్ నిర్మాణం వల్ల 21 ఏరియా, చెరువు కట్ట, సత్యనారాయణపురం, సబ్ జైలు బస్తీ, స్టేషన్ బస్తీ వారికి ఉపయోగంగా ఉంటుంది.

– చాందావత్ రమేష్‌బాబు

కంపెనీ జాప్యమే...



ఆర్టీసీ నుంచి ఎలాంటి జాప్యం లేదు. కంపెనీ జాప్యం తప్ప, టెండర్ పూర్తయింది. నిర్ణయించిన స్థలంలో గదుల సముదాయం కూల్చి వేయాల్సి ఉంది. ఇప్పటికే చర్ల, దమ్మపేటలో బంక్‌ల నిర్మాణం పూర్తికావొచ్చాయి.

– సరిరాం నాయక్, ఆర్ఎం, ఆర్టీసీ ఖమ్మం రీజియన్

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి..



సురారం గ్రామసభలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఓ చంద్రమౌళి

జూలూరుపాడు: గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) చంద్రమౌళి అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సురారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను నిరంతరాయంగా కొనసాగించాలన్నారు. అనంతరం మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యంపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఆ తరువాత నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ టి.తులసీరామ్, సెక్రటరీ ఆదూరి హరిబాబు, ఈజీఎస్ ఎఫ్ఏ వీరభద్రం పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీలో సమస్యలను మనమే గుర్తించి మనమే పరిష్కరించుకోవడమే స్వపరిపాలన అని అదనపు డీఆర్‌డీఓ ఎస్.రవి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని 36 గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించి ప్రతిజ్ఞలు చేశారు. జగన్నాథపురం గ్రామపంచాయతీలో బుధవారం నిర్వహించిన గ్రామసభకు అదనపు డీఆర్‌డీఓ హాజరై మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతీ ఇంటిలో వ్యక్తిగత మరుగుదొడ్డి, ఇంకుడుగుంతను నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ఏపీఓ పారండ్ల రంగా, కార్యదర్శి, కన్సల్టెంట్ రేవతి, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

టేకులపల్లి: బోడు గ్రామ పంచాయతీ కారేపల్లి తండాలో గురువారం ఘనంగా బొడ్రాయి, ముత్యాలమ్మ, పోతురాజు, గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు, యువతులు ఊరేగింపు వచ్చి బొడ్రాయి, ముత్యాలమ్మ, గ్రామ దేవతల విగ్రహాలకు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, రవి, వీరన్న, శంకర్, కృష్ణ, సాగర్, నందు, దళ్‌సింగ్, రాందాస్, నవీన్, సత్యం, తరుణ్, శ్రీను, సక్కు, విక్రం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ నోటీస్ అందజేత

ఇల్లెందు: ఇల్లెందు శ్రీదేవి ట్రాన్స్‌పోర్టు యజమానికి డిమాండ్ నోటీస్ అందజేసినట్లు ఇఫ్టూ ఇల్లెందు ఏరియా మోటార్ ఫెడరేషన్ అధ్యక్షుడు డి.మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం మాట్లాడుతూ.. కేటీసీ నుంచి ఇల్లెందు సీహెచ్‌పీకి బొగ్గు రవాణా చేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు వేతనాలు పెంచాలని కోరారు. గతంలో చేసిన ఒప్పందం 2025 జనవరితో ముగిసిందన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా జీఓపైన 50 శాతం వేతనాలు పెంచాల్సి ఉందన్నారు. చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్, బాలు,రమేష్, మోరే వెంకటేశ్వర్లు, చిరంజీవి, రామయ్య, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించండి..

పాల్వంచరూరల్: ప్రజాసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక పట్టణంలో ప్రదర్శన నిర్వహించి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్నో ఆశలతో గెలిపించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను విస్మరిస్తోందన్నారు. నిరుపేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు కనకయ్య, దొడ్డ రవికుమార్, జ్యోతి, సత్య, సత్యవాణి, సులోచన, గొస్య, మాధవి, రాములు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ

జూలూరుపాడు: జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో చనిపోయిన పర్యాటకుల ఆత్మశాంతి చేకూరాలని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి మండల కేంద్రం జూలూరుపాడులో ప్రధాన రహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులు, పాకిస్తాన్ దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదేవిధంగా ఉగ్రదాడికి నిరసనగా కాంగ్రెస్ నాయకులు, జర్నలిస్టులు, స్థానికులు కలిసి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, మాదినేని సతీష్, సిరిపురపు ప్రసాద్, రామారావు, గోపాల్‌రావు, రాంశెట్టి రాంబాబు, కొలిపాక వెంటేశ్వర్లు, తాళ్లూరి అచ్చయ్య, తిప్పర్తి శివ, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: టూరిస్టులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా గురువారం స్థానిక పట్టణంలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించి, అంబేడ్కర్ సెంటర్‌లో మానహారం చేశారు. మృతులకు నివాళులర్పించారు. బి.రాజు, వెంకటేశ్వర్లు, ఎస్‌కే.యాకూబ్‌పాషా, విజయభాస్కర్, ఎం.కిషోర్, రాంబాబు, మంగీలాల్, శ్రీనివాస్, రహీముద్దీన్ పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి..

కొత్తగూడెంఅర్బన్: కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై కాల్పులు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం టౌన్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ పాస్టర్ సమూయేల్ అన్నారు. గురువారం కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పించి మాట్లాడారు. విజయ్ కుమార్, నాని మోజెస్, జెర్మియా పాల్గొన్నారు.



జూలూరుపాడులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జర్నలిస్టుల ఆధ్వర్యంలో... పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులకు నిరసనగా గురువారం కొత్తగూడెంలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి మృతి చెందిన వారికి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. పర్యాటకులపై ఉగ్రవాదల కాల్పులు హేయమైన చర్య అన్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

ఎల్కతుర్తికి గులాబీదండులా కదలాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లెందు: ఈ నెల27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ 25 ఏళ్ల రజతోత్సవ సభకు గులాబీ దండు కదలాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బానోతు హరిప్రియ, బీఆర్ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్ కోరారు. గురువారం ఇల్లెందు పట్టణంలోని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటి పార్టీ 25 వసంతాల పండుగకు స్వచ్ఛందంగా తరలి వెళ్లి విజయవంతం చేయాలన్నారు.

ఒకనాడు తెలంగాణ అనే పదం ఉచ్చరించేందుకు భయపడిన ప్రజలు నేడు నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు.. నా తెలంగాణ.. అనే స్థాయికి తీసుకొచ్చిన చరిత్ర బీఆర్ఎస్, కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అలాంటి గులాబీ జెండా ఆవిర్భవించి ఈ నెల 27నాటికి 25 వసంతాలు అవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిలివేరు సత్యనారాయణ, దేవీలాల్ నాయక్, పరుచూరి వెంకటేశ్వర్లు, ఎస్ రంగనాథ్, జాఫర్ హుస్సేన్, శీలం రమేష్, రేణుక, బావుసింగ్ నాయక్, అబ్దుల్ నబీ, గిన్నారపు రాజేష్, జబ్బార్, హరిప్రసాద్‌యాదవ్, యలమద్ది రవి, భూక్యా సురేష్, పూదూరి లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వండి..



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈసం వెంకటమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.పద్మ మాట్లాడుతూ.. ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు సెలవులు ఇచ్చి అంతకంటే తక్కువ వయస్సున్న అంగన్‌వాడీ పిల్లలకు సెలవులు ఇవ్వకపోవడం సరైంది కాదని, పెద్ద పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడు చిన్నపిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు ఎలా వస్తారని ప్రశ్నించారు. బొగ్గు గనుల ప్రాంతం కాబట్టి ఎండలు విపరీతంగా ఉన్నట్లు చెప్పారు. ఎండతీవ్రత వలన పిల్లలకు ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వెంటనే అంగన్‌వాడీలకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయశీల, కళావతి, రాధాకుమారి, రాజ్యలక్ష్మి, హేమలత, కృష్ణవేణి, సావిత్రి, లక్ష్మి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలను ఎస్టీలతో సమానంగా చూడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: ఏజెన్సీలో అభివృద్ధిలో వెనకబడిన ఎస్సీ కులాలను ఎస్టీలతో సమానంగా అభివృద్ధి చేయాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ నాగభవానీకి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంతం పేరుతో కట్టుకున్న ఇంటిపైన, సాగు భూములపైన హక్కులు, అధికారాలు లేకుండా అన్యాయం చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంతం ఎస్సీ కులాలను అభివృద్ధికి దూరం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హక్కులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎనగంటి అర్జున్‌రావు, మెంతెన కొండల్‌రావు, రాసమల్ల నరసయ్య, సుందర్ పాల్, దేవరాజు, ఎనగంటి శ్రీనివాస్, కందే రాములు, కుంపటి బెంజరావ్, సరికొండ స్వామి, కత్తుల వెంకన్న, కనకం శ్రీనివాస్, కుమ్మరి రవి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందురూరల్: నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాలలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని డీఎస్పీ చంద్రభాను అన్నారు. రొంపేడు చెక్‌పోస్టు ప్రాంతంలో గురువారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని కోరారు. వీటితో కలిగే ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతోపాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అంతకు ముందు పోలీసు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వాహనాలను తనిఖీ చేశారు. కాగితాలు లేని ఐదు బైక్‌లను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై మే డే జరపండి..



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 139వ మేడే జరపాలని పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో మే డే పోస్టర్లను ఇఫ్టూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కే.సారంగపాణి మాట్లాడుతూ... మోదీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత కార్మికవర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లక్ష్యంతో నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారని, ప్రభుత్వరంగ పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు అమ్మివేస్తున్నారని వీటికి వ్యతిరేకంగా పోరాడాలని కార్మికవర్గానికి 139వ మే డే సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీ రాసుద్దీన్, డి.ప్రసాద్, ఎన్.సంజీవ్, యాసారపు వెంకన్న, కొప్పుల శ్రీనివాస్, మారుతీరావు, మోహన్‌రావు, రమేష్, ఉపేందర్‌రావు, జి.నాగేష్, అదేర్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన ప్రజలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు, డ్రెయినేజీ, కోతులు, కుక్కల బెడద సమస్యలు పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని స్తంభింపజేస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ హెచ్చరించారు. మున్సిపాలిటీలో కిన్నెరసాని తాగునీరు ప్రతీరోజు జరఫరా చేయాలని ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇవ్వాలని, వార్డులో డ్రెయినేజీలు శుభ్రం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక సింగరేణి హెడ్డాఫీస్ పార్క్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఖాళీ బిందెలు, కుండలతో గురువారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ... కొత్తగూడెం మున్సిపాలిటీలోని వార్డుల్లో సీపీఎం సర్వే నిర్వహించిందని అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రధానంగా తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిన్నెరసాని నీరు 15 రోజులకోసారి చుట్టం చూపుగా వస్తున్నాయన్నారు. వేసవికాలంలో ప్రజలు తాగునీటి కోసం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. పెన్షన్లకు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. కోతులు, కుక్కల బెడద నుంచి ప్రజలు భయభ్రాంతులకు గురవుతుంటే అధికారులకు చీమకుట్టినట్లుగా కూడా లేదని వాపోయారు. మున్సిపల్ అధికారులకు ఇంటి పన్నులు వసూలు చేసి ఖజానా నింపుకోవడంలో ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై లేదని విమర్శించారు. గృహజ్యోతి పథకం కింద జీరో కరెంట్ బిల్లు రావడం లేదని దీనిని అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరుతో దరఖాస్తులు తీసుకొని మరిచారన్నారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ సమస్య పరిష్కారం చేయడంలో చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, డి.వీరన్న, సందుకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, జునుమాల నగేష్, ఆలేటి శ్రీను, నాగకృష్ణ, కేహెచ్ ప్రసాద్, ఎస్ఎస్ రాజు, కొలిపాక వెంకటేశ్వర్లు, ముతేష్, శివ, గిరి పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తాగునీటి సరఫరా చేయాలలని కోరుతూ విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ గ్రామపంచాయతీల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు అబ్బుల్ నబీ మాట్లాడుతూ.. రెండు గ్రామపంచాయతీల పరిధిలో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయిందని, సింగరేణి సంస్థ సైతం నీటి సరఫరా చేపట్టకపోవడం విచారకరమన్నారు. బోర్లు, బావులు కూడా లేకపోవడంతో ప్రజలంతా తీవ్ర నీటిఎద్దడితో ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. పంచాయతీ అధికారులు ట్యాంకర్లతో తక్షణం నీటిసరఫరా చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుల్తానా, బాలమ్మ, సారమ్మ,తార, సాహెద, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంఅర్బన్: మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు



ఇల్లెందురూరల్: తిలక్‌గనగర్ గ్రామపంచాయతీ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

లీకేజీలతో తాగునీటి ఎద్దడి



రామవరంలోని వివిధ ప్రాంతాలలో పైపులైన్ల లీకేజీలు, కలుషితమవుతున్న తాగునీరు

- కలుషితమవుతున్న తాగునీరు
- ప్రజారోగ్యానికి ప్రమాదం
- పట్టించుకోని అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నీటిఎద్దడికి మంచినీటి పైపులైన్ల లీకులు కారణమవుతున్నాయి. అదేవిధంగా లీకేజీ వద్ద నీరు నిల్వ ఉండడం, రోడ్లపై పారడం జరుగుతోంది. అంతేకాకుండా వేసవి కాలం కావడంతో ఆ నీటిని కుక్కలు, పశువులు తాగడం వల్ల అవే నీరు పైపుల ద్వారా సరఫరా అవుతున్నాయి. ఊటగా మారుతున్న మురుగునీటిలో క్రిమి కీటకాలు చేరడంతో ఆ నీరు పైపుల ద్వారా తాగునీరుగా సరఫరా అయ్యే దుస్థితి కూడా ఉంది. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరంలో కిన్నెరసాని పైపులైన్లు తరచూ పగిలి లీకులు కావడం వల్ల నీరు వృథా అవుతోంది. దీంతో ప్రజలు తీవ్ర మంచినీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా పగిలిన పైపులైన్ల కారణంగా నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం పొంచి ఉంది. రామవరంలో ఉన్న వార్డులలో ఇదే సమస్య తలెత్తింది. నూతన పైపులైన్ల నిర్మాణ ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. లీకులను నివారించి తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యను పరిష్కరించాలి...



వేసవికాలం కాబట్టి నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. పైపు లీకేజీలను అరికట్టి సక్రమంగా తాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. ఎండతీవ్రత దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించాలి.

– జి రాజేశ్వరి, రామవరం

ప్రజల ఆరోగ్యంపై ప్రభావం..



పైపులైన్ల లీకేజీలు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటి నుంచి మురికి నీరు ప్రవహించి తాగునీరుగా సరఫరా జరిగితే ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. లీకులను నివారించి ప్రజారోగ్యాన్ని కాపాడాలి.

సీహెచ్, లక్ష్మణ్, రామవరం